నేడు ఎస్పీఆర్ హిల్స్ రిజర్వాయర్ ప్రారంభం

● హాజరుకానున్న మంత్రి పొన్నం

బోరబండ, మే 16 (ఆంధ్రజ్యోతి): రహ్మత్‌నగర్, బోరబండ డివిజన్లకు చెందిన బస్తీల ప్రజల నీటికష్టాలు శాశ్వతంగా తీరనున్నాయి. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన తాగునీటి రిజర్వాయర్‌ను రాష్ట్ర మంత్రి, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం ఉదయం ప్రారంభించనున్నారు. రహ్మత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్‌హిల్స్‌లో చేపట్టిన 30 లక్షల లీటర్ల సామర్థ్యం గల భూతల సర్వీస్ రిజర్వాయర్ (జీఎల్ఎస్ఆర్) ప్రజలకు అందుబాటులోకి రానుంది. రూ.10.7 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన రిజర్వాయర్ నిర్మాణం పూర్తయి నేడు ప్రారంభం కానుండడంతో రెండు డివిజన్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఎస్పీఆర్ హిల్స్ రిజర్వాయర్

తీరనున్న నీటి కష్టాలు

రిజర్వాయర్ ప్రారంభంతో కొన్నేళ్లుగా అర్ధరాత్రి, అపరాత్రి వేళల్లో నిర్ణీత సమయం అంటూ లేకుండా జరిగిన నీటిసరఫరాతో అవస్థపడిన జనం కష్టాలు తీరనున్నాయి. బోరబండ సైట్-1 కాలనీలోని రిజర్వాయర్ నుంచి ఎస్పీఆర్‌హిల్స్ రిజర్వాయర్‌కు అనుసంధానం చేస్తూ 600 ఎంఎం వ్యాసంతో 900 మీటర్ల పొడవున పైప్‌లైన్ పనులు రెండు రోజుల క్రితమే పూర్తయ్యాయని జలమండలి అధికారులు తెలిపారు. దీంతో ఇతర ప్రాంతాల్లో జరుగుతున్నట్లే రెండు రోజులకోసారి నిర్ణీత వేళల్లో నీటిసరఫరా జరుగుతుందని అధికారులు అంటున్నారు. ప్రస్తుతం శేరిలింగంపల్లి నుంచి ఎస్ఆర్ఆర్‌పురం కాలనీ సైట్-2లోని ఎస్పీఆర్ హిల్స్ విభాగానికి 6 ఎంఎల్ సామర్థ్యం గల రిజర్వాయర్‌కు గోదావరి జలాలు వస్తున్నాయి. అక్కడి నుంచి ఎస్పీఆర్‌హిల్స్‌లోని ఒక ఎంఎల్ సామర్థ్యం గల రిజర్వాయర్‌కు పంపింగ్ చేస్తున్నారు.

స్పందించిన కేటీఆర్

ఉచిత నీటిసరఫరా పథకాన్ని ప్రారంభించేందుకు ఎస్పీఆర్‌హిల్స్ ప్రాంతానికి నాలుగున్నర సంవత్సరాల క్రితం వచ్చిన అప్పటి మంత్రి కేటీఆర్‌కు ప్రజలు నీటికోసం పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ విన్నవించారు. స్పందించిన కేటీఆర్ ఎస్పీఆర్ హిల్స్‌లోని ఒక ఎంఎల్ రిజర్వాయర్‌కు అనుసంధానం చేస్తూ 3 ఎంఎల్ సామర్థ్యంతో మరో జలాశయాన్ని నిర్మిస్తామని ప్రకటించారు. ఆయన ప్రకటన మేరకు రిజర్వాయర్ నిర్మాణానికి జలమండలి అధికారులు ఆర్థిక, సాంకేతిక ఆమోదం పొంది కొన్నినెలల తర్వాత రూ.10.7 కోట్ల వ్యయంతో 2022 ఆగస్టు 3న పనులు ప్రారంభించారు. 600 ఎంఎం వ్యాసం గల పైపలైన్ పనులు చేపట్టేందుకు రోడ్డు కటింగ్ చార్జి కింద రూ. 37 లక్షలు జీహెచ్ఎంసీకి చెల్లించాల్సి ఉన్నా, చెల్లింపులు లేకుండానే రోడ్డు కట్టింగ్ పనులు వేగంగా జరుగుతున్నాయి. జలాశయం సమీపంలోని విద్యుత్తు నియంత్రికలను సంబంధిత అధికారులు కొత్తగా నిర్మించిన దిమ్మెలపై తరలించారు. ప్రహరీకి ఆనుకొని ఉన్న టాయిలెట్ బాక్స్‌ను మరోచోటకు తరలించారు.

52 బస్తీలకు మోక్షం

జీఎల్ఎస్ఆర్ అందుబాటులోకి వస్తే బోరబండ, రహ్మత్‌నగర్ డివిజన్ల పరిధిలోని 52 బస్తీల ప్రజలు కొన్నేళ్లుగా ఎదుర్కొంటున్న అర్ధరాత్రి నీటిసరఫరా బాధలకు మోక్షం కలగనుంది. మూడు, నాలుగురోజులకు ఒకసారి, నిర్ణీత వేళలంటూ లేకుండా, తక్కువ ప్రెషర్‌తో జరుగుతున్న నీటిసరఫరాతో జనం పడుతున్న అవస్థలు తీరనున్నాయి. రిజర్వాయర్ అందుబాటులోకి వస్తే రెండు డివిజన్లకు చెందిన 15వేల నల్లా కనెక్షన్లకు నాణ్యమైన నీటి సరఫరా లభించనుంది.

రెండు నెలలుగా ట్రయల్ రన్

రిజర్వాయర్ పనులు దాదాపు పూర్తికావడం, పైపలైన్ పనులు కొనసాగుతున్న తరుణంలో జలమండలి అధికారులు ట్రయల్ రన్ నిర్వహిస్తున్నారు. రెండు నెలల క్రితం ప్రారంభమైన ట్రయల్ రన్ ద్వారా నీటి సరఫరా గతంలో కంటే మెరుగైందని అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా రిజర్వాయర్‌ను రాష్ట్ర మంత్రితో హడావుడిగా ప్రారంభించేందుకు రెండు వారాల క్రితం డివిజన్ నాయకులు సన్నాహాలు చేశారు. ప్రోటోకాల్ పాటించలేదంటూ నియోజకవర్గం నాయకులు ఫిర్యాదు చేయడంతో కార్యక్రమం వాయిదా పడినట్లు ప్రచారం జరుగుతోంది.

నీటి బాధలకు మోక్షం



చాలాకాలంగా బోరబండ, రహ్మత్‌నగర్ డివిజన్లకు చెందిన ప్రజలు పడుతున్న నీటి బాధలు త్వరలోనే తీరుతాయి. ఎస్పీఆర్‌హిల్స్‌లో నిర్మించిన రిజర్వాయర్ అందుబాటులోకి వచ్చిన అనంతరం నిర్ణీత వేళల్లో నీటిసరఫరా జరగడమే కాకుండా, నీటి ప్రెషర్ కూడా పెరుగుతుంది. నీళ్ల పట్టుకునేందుకు ప్రజలు ఇకపై నిద్ర, పనులు మానుకోవాల్సిన అవసరం ఉండదు. రెండు నెలలుగా నిర్వహిస్తున్న ట్రయల్ రన్ కూడా సత్ఫలితాన్నిస్తుంది.

\- హరిశంకర్, జనరల్ మేనేజర్, జలమండలి డివిజన్-6

ప్రజలకు నీటి బాధల నుంచి విముక్తి



రిజర్వాయర్ ప్రారంభమైతే బస్తీల ప్రజలు పడుతున్న నీటి బాధల నుంచి విముక్తి కలుగుతుంది. నీళ్ల ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితిలో రేయింబవళ్లు వేచి ఉండాల్సి వచ్చేది. ఈ బాధలు తొలగుతాయంటే ఆనందంగా ఉంది.

\- వేముల వీరేశం, పెద్దమ్మనగర్ బస్తీ అధ్యక్షుడు

ఆకట్టుకుంటున్న నేషనల్ సిల్క్ ఎక్స్‌పో



ప్రదర్శనలో సందర్శకులు

బంజారాహిల్స్, మే 16 (ఆంధ్రజ్యోతి): శుభకార్యాల సీజన్ మొదలైంది. మరోవైపు భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. ఈ తరుణంలో కాస్త చల్లదనం పంచడంతోపాటు ఫ్యాషనబుల్‌గా ఉండే ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు ప్రజలు మొగ్గు చూపిస్తుంటారు. ఈ నేపథ్యంలో బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.12లోని కళింగ కల్చరల్ సెంటర్‌లో ఏర్పాటైన నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ఆకట్టుకుంటోంది. మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, కాంతావర్క్, హ్యాండ్ బ్లాక్, ప్రింటెడ్ శారీస్, లినెన్ శారీస్, కలంకారి, బెంగాల్ కాటన్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ జాకెట్‌లు, లక్నోచికాన్, బనారస్ శారీస్, ఖాదీ మెటీరియల్, వన్ గ్రామ్ గోల్డ్ జువెలరీ వంటివి మహిళలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. దేశవ్యాప్తంగా 14 నగరాలకు చెందిన చేనేతకారులు తమ ఉత్పత్తులను 70కి పైగా స్టాల్స్‌లో పెట్టి వినియోగదారులకు అందుబాటులో ఉంచారు. ఈనెల 18తో ప్రదర్శన ముగుస్తుంది.

మరిది కళ్లలో కారం చల్లి దాడి

యూసుఫ్‌గూడ, మే 16 (ఆంధ్రజ్యోతి): మరిది కళ్లలో వదిన కారం చల్లింది. ఈ సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షేక్ ఇమ్రాన్ చిరు వ్యాపారి. వదిన షహీదా బేగంతో కుటుంబ గొడవలు ఉన్నాయి. ఈ క్రమంలో ఇమ్రాన్ స్నేహితురాలు ఆశ్రియాతో బయటకు వెళ్తున్న క్రమంలో యూసుఫ్‌గూడ బస్తీ రత్నదీప్ సూపర్ మార్కెట్ సమీపంలో వాహనాన్ని అటకాయించి ఇమ్రాన్ కళ్లలో కారం చల్లి షహీదాబేగం దాడి చేసింది. ఇమ్రాన్ మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

పెంపుడు కుక్కతో..

యూసుఫ్‌గూడ, మే 16 (ఆంధ్రజ్యోతి): క్రెడిట్ కార్డుపై అప్పు తీసుకున్న వ్యక్తి పెంపుడు కుక్కతో ఏజెంట్‌పై దాడి చేయించాడు. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్ నివాసి బి.నందివర్ధన్‌రావు క్రెడిట్‌కార్డుపై రెండు లక్షలు అప్పు తీసుకున్నాడు. అప్పు వసూలు కోసం క్రెడిట్‌కార్డు ఏజెంట్ సత్యనారాయణ అతడి ఇంటికి వెళ్లాడు. నందివర్ధన్ పెంపుడు కుక్కను ఏజెంట్‌పై ఉసిగొలిపి దాడి చేయించాడు. గాయాలతో సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

బోరబండ, మే 16 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్ (ఐఎంఎఫ్ఎల్) బాటిల్స్ విక్రయిస్తున్న మహిళను బోరబండ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. బంజారానగర్‌లో మద్యం అమ్ముతున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఐ నాగుల్‌మీరా అక్కడకు వెళ్లారు. స్థానిక బెల్ట్‌షాపులో మద్యం విక్రయిస్తున్న సఫ్దర్‌నగర్‌కు చెందిన అనంతమ్మ(40)ను అదుపులోకి తీసుకున్నారు. ఆమె నుంచి 200 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

దశల వారీగా సమస్యలను పరిష్కరిస్తా

● ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్

బంజారాహిల్స్, మే 16 (ఆంధ్రజ్యోతి): దశల వారీగా సమస్యలను పరిష్కరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తెలిపారు. యూసుఫ్‌గూడ డివిజన్ వెంకటగిరిలో సీసీ రోడ్డు పనులకు శుక్రవారం ఆయన కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవిలో మంచినీటి సమస్య తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నట్టు చెప్పారు. సమస్య తీవ్ర తరం ఉన్నచోట్ల ట్యాంకర్ల ద్వారా నీటిని పంపించినట్టు తెలిపారు. పలు ప్రాంతాల్లో పైప్‌లైన్‌లు నిర్మించినట్టు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ అవినాష్, నాయకుడు నర్సింగ్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి పైప్‌లైన్‌ల నిర్మాణం

● కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్



వినాయకనగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్

బంజారాహిల్స్, మే 16 (ఆంధ్రజ్యోతి): తాగునీటి సమస్య పరిష్కారం కోసం అవసరమైన చోట కొత్త పైప్‌లైన్‌ల నిర్మాణం చేపట్టనున్నట్టు జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ తెలిపారు. ఫిలింనగర్ వినాయకనగర్‌లో లో ప్రెషర్‌తో నీరు సరఫరా అవుతున్నట్టు ఫిర్యాదులు అందడంతో జలమండలి అధికారులతో కలిసి శుక్రవారం ఆయన పర్యటించారు. స్థానికులతో మాట్లాడారు. బస్తీలో లో ప్రెషర్ సమస్యను పరిష్కరించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అవసరమైతే కొత్త పైప్‌లైన్ నిర్మాణానికి ప్రతిపాదనలు చేయాలని చెప్పారు. మిగతా ప్రాంతాల్లో కూడా పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకోనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ రాంబాబు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



ఓల్డ్ కస్టమ్స్ బస్తీలో విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందజేస్తున్న సనత్‌నగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కోట నీలిమ, నాయకులు విశాల్ సుధాం, హనిఫ్ ఖాన్ తదితరులు

బేగంపేట, ఆంధ్రజ్యోతి

అప్పు చెల్లించాలని సినీ ఆర్టిస్ట్‌పై దాడి

బంజారాహిల్స్, మే 16 (ఆంధ్రజ్యోతి): తీసుకున్న అప్పు చెల్లించాలంటూ సినీ ఆర్టిస్ట్‌పై ముగ్గురు మహిళలు మరో ముగ్గురితో కలిసి దాడి చేశారు. శ్రీకృష్ణానగర్ ఏ బ్లాక్‌లో నివసించే దేవి కన్నా చౌదరి సినీ ఆర్టిస్ట్. వెంకటరాములు అనే వ్యక్తి వద్ద ఓ స్థలం కొనుగోలు చేసేందుకు రూ.23 కోట్లకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ మేరకు రూ.8.5 కోట్లు చెల్లించాడు. ఇందుకోసం ఈసీఐఎల్‌లో నివాసముండే అనురాధ వద్ద పది లక్షల రూపాయలు చేబదులుగా తీసుకున్నాడు. సమయానికి డబ్బు అందక చెల్లించలేదు. ఈనెల 15న అనురాధ ఫోన్ చేసి కృష్ణానగర్‌లోని బాలాజీ స్వీట్ షాప్ వద్దకు రమ్మంది. వెంకటరాములు అక్కడకు వెళ్లేసరికి అనురాధ ఆమె సోదరి, ఆమె తల్లి మరో ముగ్గురు దాడి చేశారు. సమీపంలోని ఓ దుస్తుల దుకాణంలోకి తీసుకువెళ్లి కర్రలతో కొట్టారు. జూబ్లీహిల్స్ పోలీసుస్టేషన్‌కు వెళ్దామని ఆటోలో ఎక్కించుకొని మరోసారి కొట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



వినాయక ఉత్సవ విగ్రహానికి పలకీ సేవలో పాల్గొన్న సినీ రచయిత పరుచూరి వెంకటేశ్వరరావు, మాజీ కార్పొరేటర్ కాజా సూర్యనారాయణ

ఘనంగా సంక్లిష్ట చతుర్దశి

బంజారాహిల్స్, మే 16 (ఆంధ్రజ్యోతి): సంక్లిష్ట చతుర్దశి వేడుకలు ఫిలింనగర్ దైవసన్నిధానంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం జరిగిన పలకీ సేవకు భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయం కిక్కిరిసిపోయింది. ఈ వేడుకల్లో సినీ రచయిత పరుచూరి వెంకటేశ్వరరావు, మాజీ కార్పొరేటర్ కాజా సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



డెంగీపై అవగాహన కరపత్రాలను విడుదల చేస్తున్న మేయర్ విజయలక్ష్మి



డెంగీ అవగాహన ర్యాలీలో కార్పొరేటర్ విజయారెడ్డి, ఎంటమాలజీ విభాగం ప్రతినిధులు

డెంగీ నివారణలో భాగస్వాములు కావాలి

మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

బంజారాహిల్స్/ఖైరతాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): డెంగీ నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ఎంటమాలజీ, వైద్యవిభాగం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం బంజారాహిల్స్‌లో నిర్వహించిన ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. అనంతరం డెంగీ నివారణపై అవగాహన కరపత్రాలను, స్టిక్కర్‌లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ చాలా మంది ఇళ్ల ముందు మొక్కలు పెట్టుకొని ఆ కుండీల్లో నీరు నిల్వ ఉంచుతారని, దీని వల్ల దోమలు వృద్ధి చెందుతాయని అన్నారు. పరిసరాల శుభ్రత విషయంలో బస్తీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, వైద్య సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు. ఖైరతాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి నుంచి జాగీర్‌దార్ బాడా, మార్కెట్, లక్ష్మీనగర్ మీదుగా ఖైరతాబాద్ గణపతి కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్పొరేటర్ విజయారెడ్డి, ఎంటమాలజీ విభాగం ఏఈ భాస్కర్ మాట్లాడుతూ దోమలు ఇంట్లో ఉండకుండా వారానికోమారు డ్రై డే పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రమణ, ప్రభాకర్, సుమన్, నాగేంద్ర, మలేరియా, ఎంటమాలజీ విభాగాల సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బోగస్ ఐటీ సంస్థలపై చర్యలు తీసుకోవాలి

పంజాగుట్ట, మే 16 (ఆంధ్రజ్యోతి): బోగస్ ఐటీ సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) సెంట్రల్ జోన్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. గచ్చిబౌలిలో ఉద్యోగాల పేరుతో పలువురి వద్ద నుంచి లక్షల రూపాయలు వసూలు చేసి బోర్డు తిప్పేసిన ప్యూరోపాల్ క్రియేషన్స్ అండ్ ఐటీ సొల్యూషన్స్ సంస్థ బాధితులకు న్యాయం చేయాలని వారు సీఎం రేవంత్‌రెడ్డికి, ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆప్ నాయకులు విజయ్ మల్లంగి, యమునగౌడ్, సుధారాణి బాధితులు వెంకటేష్, ఆదిత్య, వంశీ, చైతన్యతో కలిసి మాట్లాడారు. మాదాపూర్‌లోని స్కిల్ హబ్ కన్సల్టెన్సీ నిర్వాహకులు శిక్షణ ఇవ్వడమే కాకుండా మంచి వేతనంతో ఉద్యోగం కల్పిస్తామని మాయమాటలు చెప్పి మోసం చేశారని ఆరోపించారు. సమావేశంలో ఆప్ నాయకులు రాకేష్‌రెడ్డి, రమ్యగౌడ్, బాధితులు పాల్గొన్నారు.

కోర్టు ఉత్తర్వు ఉన్నా.. ఇంట్లోకి రానివ్వడం లేదు

అమీర్‌పేట, మే 16 (ఆంధ్రజ్యోతి): ఆస్తిలో వాటాకు సంబంధించి కోర్టు ఉత్తర్వు ఉన్నా సోదరుడు ఇంట్లోకి రానివ్వడం లేదని శశిరేఖ, కీర్తిరాథోడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఆర్‌నగర్‌లోని బాపునగర్ కమ్యూనిటీహాల్ గాంధీ విగ్రహం వద్ద తమకు న్యాయం చేయాలంటూ శుక్రవారం వారు నిరసన తెలిపారు. బాపునగర్ బస్తీకి చెందిన ఎ.చందు, పార్వతీబాయి దంపతులకు ముగ్గురు సంతానం. వీరు 2011లో మృతిచెందారు. బాపునగర్‌బస్తీలోని 90 గజాల స్థలంలో ఐదంతస్తులతో కూడిన ఓ నిర్మాణం ఉంది. ఈ విషయంలో కుమార్తెలు శశిరేఖ, కీర్తిరాథోడ్, కుమారుడు మహేష్‌బాబు మధ్య గొడవలు తలెత్తాయి. ఇంట్లో వాటా ఇవ్వనని మహేష్‌బాబు చెప్పడంతో శశిరేఖ, కీర్తిరాథోడ్ 2013లో కోర్టును ఆశ్రయించారు. వాదోపవాదాల తర్వాత 2022లో కోర్టు తండ్రి ఆస్తిలో ముగ్గురికి సమాన వాటాను నిర్దేశిస్తూ తీర్పును వెలువరించింది.

ఎంపీ వంశీకృష్ణకు అవమానం

● మాల మహానాడు

పంజాగుట్ట/ఖైరతాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదటిసారిగా భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని త్రివేణి సంగమం వద్ద ప్రారంభమైన సరస్వతి పుష్కరాల ప్రారంభోత్సవంలో పెద్దపల్లి ఎంపీ జి.వంశీకృష్ణను ఆహ్వానించకుండా అవమానించారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య ఆరోపించారు. దళిత ఎంపీకి జరిగిన అన్యాయంపై ప్రశ్నిస్తే చెన్నూరు నియోజకవర్గానికి చెందిన వారిని అరెస్టు చేశారని అన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు, ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కె.వినయ్ కుమార్‌తో కలిసి ఆయన మాట్లాడారు. మంత్రి శ్రీధర్‌బాబు, దేవాదాయ శాఖ ముఖ్యకార్యదర్శి శైలజారామయ్యార్ ఉద్దేశపూర్వకంగానే ఎంపీని ఆహ్వానించలేదని, అక్కడ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలలో ఆయన ఫొటో పెట్టలేదని ఆరోపించారు. ఎంపీని అవమానపర్చిన వారు క్షమాపణ చెప్పాలని, శ్రీధర్‌బాబును మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని, సంబంధిత శాఖ అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పి.బాను ప్రకాష్, వెంకటేష్, జి.రమేష్ పాల్గొన్నారు. ఎంపీ వంశీకృష్ణను అవమానించడం తగదని జైభీమ్ మహిళా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురాలు అంజలీదేవి పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చెన్నయ్య

చలించిన వాకర్లు.. ప్రతీ వారం అన్నదానం



క్యాన్సర్ ఆస్పత్రి వద్ద అన్నదానం చేస్తున్న స్నేహ హస్తం ఫౌండేషన్ ప్రతినిధులు

బంజారాహిల్స్, మే 16 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ ఆస్పత్రికి నిత్యం వచ్చే బాధితులతోపాటు వారి సహాయకులను చూసి చలించిన కేబీఆర్ పార్కు వాకర్లు ఓ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రతీ వారం అన్నదానం చేస్తున్నారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.10లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి వద్ద శుక్రవారం కేబీఆర్ పార్కు వాకర్లు, స్నేహ హస్తం ఫౌండేషన్ ప్రతినిధులు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము నిత్యం కేబీఆర్ పార్కుకు వాకింగ్‌కు వస్తుంటామని ఫుట్‌పాత్‌లపై క్యాన్సర్ ఆస్పత్రికి వచ్చే పేషంట్లతో పాటు వారి సహాయకులు ఆకలితో అలమటిస్తున్న తీరును చూసి చలించిపోయి అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు మహ్మద్ కతల్ హుస్సేన్, భరత్ భూషణ్, రామ్‌కుమార్, కిషోర్ కుమార్, జబ్బార్, ఫయాజ్, షౌకత్, అమీర్ పాల్గొన్నారు.



కంటోన్మెంట్ సీఈఓ, డిఫెన్స్ ఎస్టేట్ అధికారితో సమావేశమైన శ్రీగణేశ్

కంటోన్మెంట్ అధికారులతో ఎమ్మెల్యే సమావేశం

సికింద్రాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): రక్షణ శాఖ భూముల్లో నివసిస్తున్న పది వేల కుటుంబాలకు పట్టాల మంజూరు విషయమై సికింద్రాబాద్ కంటోన్మెంట్ ముఖ్యకార్యనిర్వహణాధికారి మధుకర్‌నాయక్, డిఫెన్స్ ఎస్టేట్ అధికారి దినేష్‌కుమార్‌రెడ్డిలతో స్థానిక ఎమ్మెల్యే శ్రీగణేశ్ శుక్రవారం సమావేశమయ్యారు. ఈ మేరకు కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో వారిని కలిసి చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం భూ బదలాయింపు విషయంలో సానుకూలంగా ఉందని, బోర్డు పరిధిలో ఎంత విస్తీర్ణంలో పేదల బస్తీలు ఉన్నాయి, వాటిలో మొత్తం ఎంత మంది ఉంటున్నారనే వివరాలు సమర్పించాలని ఎమ్మెల్యే కోరారు. పేదల బస్తీ వివరాలు అందిస్తే రాష్ట్ర ప్రభుత్వం భూబదలాయింపు ప్రక్రియను ముందుకు తీసుకువెళుతుందని శ్రీగణేష్ చెప్పారు.



జలమండలి అధికారి వినోద్‌తో మాట్లాడుతున్న కార్పొరేటర్ హేమ

సీతాఫల్‌మండిలోని సమస్యలు పరిష్కరించాలి

బౌద్ధనగర్, మే 16(ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్‌లోని సమస్యలను పరిష్కారించాలని స్థానిక కార్పొరేటర్ సామల హేమ అన్నారు. ఈ మేరకు శుక్రవారం జలమండలి కార్యాలయంలో జనరల్ మేనేజర్ వినోద్‌తో సమావేశమయ్యారు. వేసవి కాలంలో కొన్ని ప్రాంతాల్లో పవర్ బోర్‌వెల్స్ రిపేరు చేయలేదని, మ్యాన్‌హోల్స్ మెయింటెన్ సరిగ్గా లేదని, వర్షాకాలంలో డ్రైనేజీ ఓవర్ ఫ్లో కాకుండా ముందస్తుగా నాలా పూడికతీత పనులు చేపట్టాలని ఆమె అధికారిని కోరారు. కార్పొరేటర్ వెంట జలమండలి మేనేజర్లు నవ్య, ప్రియాంక తదితరులు ఉన్నారు.



స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రంలో మహిళలతో కార్పొరేటర్ చీర సుచిత్ర

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- రాంగోపాల్‌పేట కార్పొరేటర్ సుచిత్ర

రాంగోపాల్‌పేట, మే 16 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు అటల్ బిహారి వాజీపేయ్ ఫౌండేషన్ అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని కార్పొరేటర్ చీర సుచిత్ర అన్నారు. రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని పాన్ బజార్ సామాజిక భవనంలో నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని డివిజన్ కార్పొరేటర్ చీర సుచిత్ర శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో ఉన్న సౌకర్యాల గురించి శిక్షణ పొందుతున్న మహిళలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ఫౌండేషన్ ఇస్తున్న శిక్షణను డివిజన్‌లోని ప్రతి మహిళా సద్వినియోగం చేసుకుని తమ కాళ్ల మీద తాము నిలవాలని సూచించారు. శిక్షణ అనంతరం లభించే సర్టిఫికెట్లతో సొంతంగా వ్యాపారాలు చేసుకోవచ్చని అన్నారు. అందుకు కావలసిన ఆర్థిక సహకారాన్ని ముద్రా లోన్ల ద్వారా పొందవచ్చని కార్పొరేటర్ సుచిత్ర సూచించారు.



తిరంగా ర్యాలీ కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

తిరంగా ర్యాలీని జయప్రదం చేయాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్

సికింద్రాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): సిటిజనల్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో శనివారం ట్యాంక్‌బండ్ వద్ద జరిగే తిరంగా ర్యాలీని విజయవంతం చేయాలని బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి విజ్ఞప్తిచేశారు. సికింద్రాబాద్‌లోని చిలకలగూడ, సీతాఫల్‌మండి, ఉస్మానియా విశ్వవిద్యాలయం, జింఖాన, తదితర ప్రాంతాల్లో శుక్రవారం వారు పర్యటించారు. ఈ సందర్భంగా వాకర్స్ క్రీడాకారులు, యువతకు కార్యక్రమ కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, పాకిస్థాన్ ఉగ్రవాదులకు భారత సైనికులు తగిన రీతిలో బుద్ధి చెప్పి ప్రపంచ దేశాల మన్ననలు పొందారని కొనియాడారు. బీజేపీ అధికారంలో ఉంటేనే దేశం బాగుంటుందని అన్నారు. ఈ సందర్భంగా దేశ ఆర్మీ సిబ్బందికి, సైన్యానికి పూర్తి అధికారాలు ఇచ్చిన ప్రధాని మోదీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జంటనగరాల పౌరులు ఈ ర్యాలీలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు భాస్కర్‌గిరి, అంబాల రాజేశ్వర్‌రావు, హనుమంతుముదిరాజ్, బొండ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



ఆలయ స్లాబు నిర్మాణపనులకు భూమిపూజ చేస్తున్న వేణుగోపాల్‌రెడ్డి, శ్రీధర్‌యాదవ్

ఆలయాల అభివృద్ధికి కృషి

- ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి

తిరుమలగిరి మే 16 (ఆంధ్రజ్యోతి): భక్తుల సౌకర్యార్థం బొల్లారంలోని దేవాలయాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని బోయిన్‌పల్లి మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ చింతల వేణుగోపాల్ రెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ యాదవ సంఘం ఉపాధ్యక్షుడు శ్రీధర్ యాదవ్ అన్నారు. బొల్లారం కొత్త బస్తీలోని రేణుక ఎల్లమ్మ దేవాలయం కమిటీ సభ్యుడు శివకుమార్ విజ్ఞప్తి మేరకు ఆలయ స్లాబు నిర్మాణానికి వారు ముందుకు వచ్చి శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి సాయం చేయడం సంతోషంగా ఉందన్నారు. బొల్లారం పరిసర ప్రాంతాల్లోని ఆలయాల అభివృద్ధికి తమ వంతుగా కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో బోయిన్‌పల్లి మార్కెట్ యార్డు డైరెక్టర్ రమణ, రమేశ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు

తహసీల్దార్ హారిక



తిరుమలగిరి, మే 16 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి మండలంలోని ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు చేపట్టినట్టు ఎఫ్ఏసీ తహసీల్దార్ హారిక తెలిపారు. మండల పరిధిలో ఉన్న చెరువులు కబ్జాలు కాకుండా భూగర్భ జలాలను కాపాడడానికి కృషి చేస్తున్నామన్నారు. తిరుమలగిరి విలేజ్ సమీపంలోని సర్వే నెంబర్ 118లో ఉన్న తిరుమలగిరి చెరువు కాపాడుకోవడానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ప్రభుత్వ స్థలాల పరిరక్షణ, డబుల్ బెడ్ రూమ్స్, రాజీవ్ యువవికాసం దరఖాస్తులపై 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె పలు విషయాలు వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి: ప్రభుత్వ స్థలాలు కాపాడడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

హారిక: ప్రభుత్వ స్థలాలు కాపాడడానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించాం. తమ సిబ్బంది ఎప్పటికప్పుడు మండలంలోని ఆయా ప్రాంతాల్లో పర్యటించి ప్రభుత్వ స్థలాల తీరు తెన్నులను పరిశీలిస్తున్నారు. ప్రభుత్వానికి చెందిన ఇంచు స్థలం అన్యాక్రాంతమైనా ఊరుకునేది లేదు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించింది ఎంతటి వారైనా.. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి : ప్రభుత్వ స్థలాలను ల్యాండ్ బ్యాంక్‌లో ఉంచారా?

హారిక: ప్రభుత్వ స్థలాలను ల్యాండ్ బ్యాంక్‌లో ఉంచడంతో పాటు గూగుల్ కు అనుసంధానం చేశాం. ప్రైవేటు వ్యక్తులు కబ్జాకు యత్నించినా కలెక్టర్ కార్యాలయం నుంచి మానిటర్ చేస్తూ గూగుల్ ద్వారా గుర్తించడం జరుగుతుంది. తద్వారా కఠిన చర్యలు ఉంటాయి.

ఆంధ్రజ్యోతి : రాజీవ్ యువ వికాసంలో ఎన్ని దరఖాస్తులు వచ్చాయి?

హారిక: రాజీవ్ యువవికాసం పథకానికి మండలంలో సుమారు 2,589 దరఖాస్తులు వచ్చాయి. కొందరు దరఖాస్తు ఫారాలు కార్యాలయంలో అందించలేదు. దరఖాస్తు చేసుకుని కార్యాలయంలో ఇవ్వని వారికి స్వయంగా ఫోన్‌చేసి దరఖాస్తులను కార్యాలయానికి తెప్పించుకుంటున్నాం. దరఖాస్తులను బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కార్పొరేషన్లు స్క్రూటినీ చేసి బ్యాంకులకు అందజేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: రుణాల పంపిణీ ఎలా?

హారిక: రుణాల లబ్ధిదారులను ఆయా కార్పొరేషన్లు ఎంపిక చేస్తాయి.

ఆంధ్రజ్యోతి: డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారులకు నోటీసు ఎందుకు ఇచ్చారు?

హారిక: 18 నెలల క్రితం ప్రభుత్వం నిరుపేదలైన లబ్ధిదారులను గుర్తించింది. నగర శివారు ప్రాంతాల్లోని నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్‌లను వారికి కేటాయించారు. అయితే లబ్ధిదారులు ఇళ్లల్లోకి వెళ్లకుండా తాళాలు వేసుకుని నగరంలోనే ఉంటున్నారు. ఇళ్లను మంజూరు చేసిన తర్వాత కూడా ఆ ఇళ్లల్లోకి ఎందుకు వెళ్లలేదని నోటీసులు జారీ చేశాం.

ఆంధ్రజ్యోతి : ఎంత మందికి నోటీసులు జారీ చేశారు?

హారిక: సుమారు మండలంలోని 608 మందికి నోటీసులు జారీ చేశాం. అందులో కొంత మంది తగిన కారణాలు కూడా తెలియజేశారు. నోటీసులకు సమాధానమివ్వని వారి ఇండ్లు స్వాధీనం చేసుకుని మిగిలిన అర్హులకు అందిస్తాం.

నేడు జింఖానా మైదానంలో 'మా భగవతి విశాల్ జాగరణ్'

సికింద్రాబాద్, మే16 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ జింఖాన మైదానంలో శనివారం రోజున 'మా భగవతి విశాల్ జాగరణ్' నిర్వహించనున్నట్టు మా వైష్ణో దేవి జాగరణ్ మండల్ ప్రతినిధులు తెలిపారు. జింఖాన మైదానంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. శనివారం రాత్రి 8.30గంటల నుంచి మరుసటి రోజు తెల్లవారు జాము జాగరణ్ కార్యక్రమంలో కొనసాగుతుందని తెలిపారు. విశాల్ జాగరణ్‌లో సుప్రసిద్ధ గాయకులు లఖ్‌బీర్‌సింగ్ లక్కా, రాజుమురారి దాహిమా, రాజు భావ్రా, ప్రతీక్ దాహిమా, స్వాతి దాహిమాలు తమ భక్తిగీతాలతో అలరించనున్నారని తెలిపారు. జంటనగరాల నుంచి 10వేల మంది వరకు భక్తులు హాజరుకానున్నారని వారు తెలిపారు. 20 సంవత్సరాలుగా తమ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది మా భగవతి కా జాగరణ్ నిర్వహిస్తున్నట్టు వారు చెప్పారు. మా వైష్ణో దేవి జాగరణ్ మండల్ సికింద్రాబాద్ చీఫ్ పాట్రన్ ఆశిష్ అగర్వాల్, చైర్మన్ సురేందర్ జోషి, వైస్ చైర్మన్ వినోద్ పొద్దార్, వైస్ ప్రెసిడెంట్ సంజయ్ అగర్వాల్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కార్యదర్శి రాజేష్‌గోయల్, కోశాధికారి సందీప్ జోషి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

- మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు
- భోలక్‌పూర్‌లో ఉచిత వైద్య శిబిరం

పద్మారావునగర్, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు సూచించారు. జనహిత సేవా ట్రస్ట్, భారత్ వికాస్ పరిషద్, కిమ్స్ ఫౌండేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్ల సంయుక్త ఆధ్వర్యంలో భోలక్‌పూర్‌లోని ఎవర్‌గ్రీన్ ఫ్రెండ్స్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని మాజీ ఎమ్మెల్సీ ప్రారంభించారు. పేద ప్రజల ఆరోగ్య రక్షణ కోసం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులను ఆయన అభినందించారు. వైద్య శిబిరంలో 175 మంది పాల్గొన్నారు. వారిని పరీక్షించిన వైద్యులు అవసరమైన వారికి మందులు, ఆరోగ్య సలహాలు అందించారు. ప్రముఖ ఫిజియోథెరపిస్ట్ శ్రీనివాస్ ఒంటి నొప్పులతో బాధపడుతున్న వారికి వ్యాయామం ఎలా చేయాలో వివరించారు. ఈ శిబిరంలో జనహిత సేవా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నరసింహమూర్తి, నర్సింగరావు, భారత్ వికాస్ పరిషద్ రాష్ట్ర అధ్యక్షుడు నాగశేఖర్‌గుప్త, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివరామకృష్ణ, సతీశ్‌కుమార్, బాలభారతి, సుజాత శివరామకృష్ణ, ఎవర్‌గ్రీన్ ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ, వెంకటేశ్, ఎల్లేశ్వర్, జానకిరామ్, బీజేపీ నాయకులు రాజశేఖరరెడ్డి, శివలింగం, మహేశ్, కిషన్, రఘురాం, హరినాథ్, నాగరాజు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో రోగులకు మందులను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు

జిమ్ కరెంట్ బిల్లు జీహెచ్ఎంసీనే భరించాలి

- కాంగ్రెస్ నాయకుడు మల్లికార్జున్
- డీసీకి వినతిపత్రం అందజేత

రాంగోపాల్‌పేట్, మే 16 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ అధ్వర్యంలో నడుస్తున్న వ్యాయామశాల కరెంట్ బిల్‌ను వారే భరించాలని కాంగ్రెస్ రాంగోపాల్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు దండుగల మల్లికార్జున్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జీహెచ్ఎంసీ బేగంపేట సర్కిల్ ఉపకమిషనర్ డాకు నాయక్‌ను కలిసి రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ పంపిన వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నల్లగుట్టచుట్టాల బస్తీలోని పురాతన వ్యాయమశాలను జీహెచ్ఎంసీ నిర్వహిస్తోందని, కరెంట్ బిల్ కూడా జీహెచ్ఎంసీ కమిషనర్ పేరున ఉందని గుర్తు చేశారు. బిల్లు పెండింగ్‌లో ఉండడం వల్ల గత నెల విద్యుత్ శాఖ వారు వ్యాయామశాల కరెంట్ కట్ చేశారని, దీంతో అందులో వ్యాయామం చేసుకునేవారు చందాలు వేసుకుని రూ.9వేలు చెల్లించారన్నారు. ఈ నెల కూడా కరెంటు బిల్లు పెండింగ్‌లో ఉండడాన్ని ఎంపీ అనిల్‌కు తెలపగా తాను వెంటనే జీహెచ్ఎంసీ వారికి లేఖ రాశారన్నారు. స్పందించిన డీసీ వెంటనే కరెంటు బిల్లు కట్టేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఎంపీ అనిల్‌కుమార్, జీహెచ్ఎంసీ డీసీ డాకూ నాయక్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అరుణ్, ప్రకాశ్‌ముదిరాజ్, వెంకట్ లెల్లా, రఘు యాదవ్, శ్రీకాంత్‌చారి, ఈశ్వర్, సంతోశ్ దదీచ్, నోమన్, మాకు ఏల్లేశ్, రఘు ముదిరాజ్, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

డెంగ్యూ నివారణకు కృషి చేయాలి

- డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డి
- తార్నాకలో వ్యాధి నివారణపై అవగాహన

తార్నాక, మే 16 (ఆంధ్రజ్యోతి): డెంగ్యూ వ్యాధిని నివారించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, అందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి ప్రజలకు సూచించారు. జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జీహెచ్ఎంసీ సిబ్బందితో కలిసి తార్నాక డివిజన్‌లోని పలు కాలనీలు, బస్తీలలో డిప్యూటీ మేయర్ ఇంటింటికి బ్రోచర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డెంగ్యూ వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, దోమల నివారణకు ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. నీటిని ఎక్కువ కాలం నిల్వ ఉంచకూడదని చెప్పారు. ప్రభుత్వ సంస్థలు, కాలనీ సంక్షేమ సంఘాలు, విద్యా సంస్థలు, ప్రజల సమన్వయంతో డెంగ్యూ, చికెన్‌గున్యా, మలేరియా వంటి వ్యాధులను పూర్తిగా నియంత్రించవచ్చని, ఆ దిశగా ప్రతి ఒక్కరు తమ సహకారాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఎంటమాలజీ దుర్గాప్రసాద్, రాజశేఖర్, ప్రదీప్, జుబేర్, జాఫర్, ఫరూక్, అశోక్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



డెంగ్యూ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్‌రెడ్డి

ఎంపీ వంశీకృష్ణకు అవమానం: మాలమహానాడు

పంజాగుట్ట/ఖైరతాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదటిసారిగా భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని త్రివేణి సంగమం వద్ద ప్రారంభమైన సరస్వతి పుష్కరాల ప్రారంభోత్సవంలో పెద్దపల్లి ఎంపీ జి.వంశీకృష్ణను ఆహ్వానించకుండా అవమానించారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య ఆరోపించారు. దళిత ఎంపీకి జరిగిన అన్యాయంపై ప్రశ్నిస్తే చెన్నూరు నియోజకవర్గానికి చెందిన వారిని అరెస్టు చేశారని అన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు, ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కె.వినయ్ కుమార్‌తో కలిసి ఆయన మాట్లాడారు. మంత్రి శ్రీధర్‌బాబు, దేవాదాయ శాఖ ముఖ్యకార్యదర్శి శైలజారామయ్యార్ ఉద్దేశపూర్వకంగానే ఎంపీని ఆహ్వానించలేదని, అక్కడ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలలో ఆయన ఫొటో పెట్టలేదని ఆరోపించారు. ఎంపీని అవమానపర్చిన వారు క్షమాపణ చెప్పాలని, శ్రీధర్‌బాబును మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని, సంబంధిత శాఖ అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పి.బానుప్రకాష్, వెంకటేష్, జి.రమేష్ పాల్గొన్నారు. ఎంపీ వంశీకృష్ణను అవమానించడం తగదని జైభీమ్ మహిళా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురాలు అంజలీదేవి పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చెన్నయ్య

చలించిన వాకర్లు.. ప్రతీ వారం అన్నదానం

బంజారాహిల్స్, మే 16 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ ఆస్పత్రికి నిత్యం వచ్చే బాధితులతో పాటు వారి సహాయకులను చూసి చలించిన కేబీఆర్ పార్కు వాకర్లు ఓ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రతీ వారం అన్నదానం చేస్తున్నారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.10లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి వద్ద శుక్రవారం కేబీఆర్ పార్కు వాకర్లు, స్నేహ హస్తం ఫౌండేషన్ ప్రతినిధులు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము నిత్యం కేబీఆర్ పార్కుకు వాకింగ్‌కు వస్తుంటామని ఫుట్‌పాత్‌లపై క్యాన్సర్ ఆస్పత్రికి వచ్చే పేషంట్లతో పాటు వారి సహాయకులు ఆకలితో అలమటిస్తున్న తీరును చూసి చలించిపోయి అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు మహ్మద్ కతల్ హుస్సేన్, భరత్ భూషణ్, రామ్‌కుమార్, కిషోర్ కుమార్, జబ్బార్, ఫయాజ్, షౌకత్, అమీర్ పాల్గొన్నారు.



క్యాన్సర్ ఆస్పత్రి వద్ద అన్నదానం చేస్తున్న స్నేహ హస్తం ఫౌండేషన్ ప్రతినిధులు

వాటర్‌ప్లాంట్ ఓకే.. నీళ్లేవి?

- తాగునీటికి ఇబ్బందులు పడుతున్న రోగులు

అడ్డగుట్ట, మే 16 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలోని వాటర్‌ప్లాంట్‌లో నీరు రావడం లేదు. దీంతో ఆసుపత్రికి వచ్చిన రోగులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు రోజుల క్రితం ఆర్వో వాటర్ ప్యూరిఫికేషన్ ప్లాంట్‌ను గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి ప్రారంభించారు. రూ. 42.36 లక్షల వ్యయంతో దివీస్ కంపెనీ ద్వారా గాంధీ ఆస్పత్రిలో 23 చోట్ల మంచినీటి ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఓపీ పక్కనే ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌కు నీటి కనెక్షన్ ఇచ్చారే తప్పా ప్లాంట్‌లో ఉన్న స్విచ్ ఆన్ చేయడం మరిచారు. దీంతో ఆ ప్లాంట్‌లో నీళ్లు రావడం లేదు. పక్కనే ఉన్న సింటెక్స్ ట్యాంక్‌లో ఫుల్‌గా నీళ్లు ఉన్నప్పటికి మూడు రోజులుగా స్విచ్ ఆన్ చేయలేదు. మూడు రోజులుగా ఆస్పత్రి సూపరింటెండెంట్, ఆర్ఎంఓలు దీన్ని పట్టించుకోలేదు. అంతేగాక ప్రారంభించిన 23 ప్లాంట్లలో సగం మాత్రమే పనిచేస్తున్నాయి. దీంతో ఆసుపత్రికి వచ్చిన రోగులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి వాటర్‌ప్లాంట్‌లు నడిచేలా చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.

బీజేపీ బన్సీలాల్‌పేట్ డివిజన్ కమిటీ ఎన్నిక



డివిజన్ కమిటీ ఏర్పాటు పత్రాన్ని అందజేస్తున్న భరత్‌గౌడ్

పద్మారావునగర్, మే 16 (ఆంధ్రజ్యోతి): బీజేపీ బన్సీలాల్‌పేట్ డివిజన్ నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్, జిల్లా సమరచన ప్రభారి కాంతారావు ఆదేశానుసారం కమిటీని ఎన్నుకున్నట్టు డివిజన్ అధ్యక్షుడు రామంచ మహేశ్ తెలిపారు. కమిటీ ఉపాధ్యక్షులుగా బినపల్లి పరమేశ్, నర్సమ్మ, డి.అరుణ్‌కుమార్, ఆర్.సెల్వరాజ్, ఎం.కొండల్‌రావు, ప్రధాన కార్యదర్శులుగా బందం కిరణ్, శ్రీకాంత్, కార్యదర్శులుగా గణేశ్, పరమేశ్వర్, హిమబిందు, శ్రవణ్‌రాజ్, కోశాధికారిగా మాధవితో పాటుగా 34 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్టు మహేశ్ తెలిపారు.

టీడీపీ బన్సీలాల్‌పేట్ డివిజన్ అధ్యక్షుడిగా సందీప్



సందీప్‌కుమార్

పద్మారావునగర్, మే 16(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ బన్సీలాలాల్‌పేట డివిజన్ అధ్యక్షుడిగా సందీప్ కుమార్ ఎన్నికయ్యారు. టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, సనత్‌నగర్ టీడీపీ ఇన్‌చార్జి శ్రీపతి సతీష్ నేతృత్వంలో జరిగిన పార్టీ సమావేవంలో తనను అధ్యక్షుడిగా నియమించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి తన వంతుగా కృషి చేస్తానని సందీప్‌కుమార్ చెప్పారు.

- పుస్తకాల పంపిణీ



ఓల్డ్ కస్టమ్స్ బస్తీలో విద్యార్థులకు నోట్ పుస్తకాలను సనత్‌నగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కోట నీలిమ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు విశాల్ సుధాం, హనిఫ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

బేగంపేట, మే 16 (ఆంధ్రజ్యోతి)

ఘనంగా సంక్లిష్ట చతుర్దశి

బంజారాహిల్స్, మే 16 (ఆంధ్రజ్యోతి): సంక్లిష్ట చతుర్దశి వేడుకలు ఫిలింనగర్ దైవసన్నిధానంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం జరిగిన పల్లకి సేవకు భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయం కిక్కిరిసిపోయింది. ఈ వేడుకల్లో సినీ రచయిత పరుచూరి వెంకటేశ్వరరావు, మాజీ కార్పొరేటర్ కాజా సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



రాధ

బౌద్ధనగర్, మే 16(ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపూజీనగర్‌కు చెందిన తునికి రాధ(54)కు కల్లు తాగే అలవాటు ఉంది. ఆమెకు కంటి ఆపరేషన్ ఉండడంతో నెల రోజుల నుంచి కల్లు తాగడం లేదు. ఈ నెల 12న రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన రాధ తిరిగి రాలేదు. భార్య రాధ కోసం భర్త లింగయ్య , కుమార్తె స్వప్న పలుచోట్ల వెతికారు. ఎక్కడా కనిపించలేదు. దీంతో తన తల్లి కనిపించడం లేదని కుమార్తె స్వప్న గురువారం రాత్రి పోలీసులకు ఫిర్యాదుచేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

కోర్టు ఉత్తర్వు ఉన్నా.. ఇంట్లోకి రానివ్వడం లేదు

అమీర్‌పేట, మే 16 (ఆంధ్రజ్యోతి): ఆస్తిలో వాటాకు సంబంధించి కోర్టు ఉత్తర్వు ఉన్నా సోదరుడు ఇంట్లోకి రానివ్వడం లేదని శశిరేఖ, కీర్తిరాథోడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఆర్‌నగర్‌లోని బాపునగర్ కమ్యూనిటీహాల్ గాంధీ విగ్రహం వద్ద తమకు న్యాయం చేయాలంటూ శుక్రవారం వారు నిరసన తెలిపారు. బాపునగర్ బస్తీకి చెందిన చందు, పార్వతీబాయి దంపతులకు ముగ్గురు సంతానం. వీరు 2011లో మృతిచెందారు. బాపునగర్‌బస్తీలోని 90 గజాల స్థలంలో ఐదంతస్తుల భవనం ఉంది. ఈ విషయంలో కుమార్తెలు శశిరేఖ, కీర్తిరాథోడ్, కుమారుడు మహేష్‌బాబు మధ్య గొడవలు తలెత్తాయి. ఇంట్లో వాటా ఇవ్వనని మహేష్‌బాబు చెప్పడంతో శశిరేఖ, కీర్తిరాథోడ్ 2013లో కోర్టును ఆశ్రయించారు. 2022లో కోర్టు తండ్రి ఆస్తిలో ముగ్గురికి సమాన వాటాను నిర్దేశిస్తూ తీర్పును వెలువరించింది.